

# నగర మరణం



- వివినమూర్తి



కళ్ళు తెరిచేసరికి .... కిటికీలోంచి ఎండ చురుక్కు మనిపించింది. టైము చూశాను. ఎనిమిదిన్నర. ఆశ్చర్యపోయాను. పార్వతి నా నిద్ర గురించి చాలా జాగ్రత్తపడుతుంది. తలుపు వేసి బయట గడియవేస్తుంది. ఏం లాభం? నాకు నిద్ర సుఖం లేదు. కారణం చీమ చిటుక్కుమన్నా మెలకువ వచ్చేస్తుంది. మా పై క్వార్టరు ముసిలాడు నాలుగయేసరికి లేచిపోతాడు. దగ్గుతూ కూర్చుంటాడు. మంచం జరుపుతాడు. ఈరోజేమయింది? కొంపదీసి ముసిలాడు పోయాడా!

చఛ! పొద్దుటే - పాపం - ఎవరో సంబంధంలేని - ముసిలాడి చావు గురించి ఆలోచిస్తానేంటి!

చెంపలు వేసుకున్నాను. శ్రీరామ అంటూ చేతిలో రాసుకుని ముమ్మారు కళ్ళకు అద్దుకున్నాను. మంచం మీంచి దిగి అలమరాలో పెట్టుకున్న రాములవారి చిత్రానికి నమస్కరించాను. ఆవులిస్తూ వెళ్ళి తలుపు తట్టాను.

పార్వతి వెంటనే తలుపు తీయ లేదు.

తీయగానే మండిపడ్డాను - 'ఎక్కడచచ్చావే' - అంటూ .

వెంటనే నాచేయి పట్టుకుని - "ఆ పాండే వాళ్ళ నాన్న పోయాడండి - " అంది

నాకోపం ఎగిరిపోయింది. అసంకల్పితంగా వచ్చిన ఊహ నిజం అవటంతో మనసు అదోలా అయింది. నేను వచ్చి సోఫాలో కూర్చున్నాను. "ఏం మనుషులండీ - కోడలికీ పట్టదు - అత్తకీ పట్టదు - "అంది.



Jairam..

"ఏమయింది?"

"ఏంటవుతుంది - మన పీకలమీదకి వచ్చింది. చావు బతుకుల మీద నున్న మనిషిని కనిపెట్టుకుని ఉండాలి గదా -! పెదాలకి రంగేసుకుని తిరగడంలో యీ ఉత్తరాది వాళ్ళకున్న సరదా - తిప్పుకుంటూ మాట్లాట్టంలో .... అబ్బబ్బ - వీళ్ళు ఎలా చస్తే మనకేం ! -

"నోర్మూసుకుని జరిగిందేంటో చెప్పు - " అన్నాను గట్టిగా చెప్పింది. ముసిలాడు తనగదిలో తన మంచం మీద చనిపోయాట్ట - "మనిషన్నాక చావు రాసి పెట్టి ఉంటుంది. కానీ - యిప్పుడు మనమేం చెయ్యాలి-"

పార్వతి మథన పడుతున్నదని అర్థమయింది. చూసేసరికి బావురు మనేటట్లుంది.

"ఊరుకో పార్వతీ - ఏంచేస్తాం -" సానుభూతిగా అంటున్నాను. పార్వతి దగ్గరకి వచ్చి కళ్ళనీళ్ళు పెట్టుకుని. ఎవరికీ వినపడకూడదన్నట్లుగా - అంది -" మీకేం తెలీదు - పిల్లా పాపలతో ఉన్నాం - మనతో మవుతుందోనని బెంగతో చస్తున్నాను - పిల్లలిద్దరికీ టిఫిన్ కూడా చెయ్యలేదు -డబ్బులిచ్చి బయట టిఫిన్ చేసి స్కూలుకి వెళ్ళమన్నాను - " అంది.

"ఛీ పిచ్చిదానా - మనకేమవు తుంది?'

'"అదేంటండీ అలా అంటారూ - మీ చిన్నాన్నగారు పోయినప్పుడు ఇల్లంతా ఆరు నెలలపాటు పాడు పెట్టించలేదూ-?"

"అవుననుకో -"

"మనగదికీ - ముసిలాడు పోయిన గదికీ మధ్య శ్లాబే అడ్డం. పైన శవం. కింద మనం. తలచుకుంటేనే వణుకు వచ్చేస్తోంది-"

నాకూ మతిపోయింది. ఎలాగో లేచి, కాల కృత్యాలకు వెళ్ళాను. మనసు మనసులో లేదు.

నాక్కూడా పాండే కుటుంబం మీద కోపం వచ్చింది. పూర్వం రోజుల్లో చావు బతుకులమీద మనుషుల్ని వీధిలో పెట్టి కాపలా కాసేవారు. అనుమానం వస్తే మంచం మీద నుంచి దించేవారు. మా సూర్యారావు తాతగారయితే - స్నానాల సంబంధం వాళ్ళయితే - బట్టలు తడప వలసి వస్తుందేమోనని - గోచీ పెట్టుకుని కూర్చోనేవాడు." నక్షత్రం బాగోకపోతే మా తాతగారు మంచం పట్టినపుడు - మా నాన్నగారు ఎంత హడావుడి చేసేవారో చెప్పలేను. ఏం రోజులు వచ్చాయి! ఆ బాధ్యతలు పోయాయి. కొడుకుకీ, కోడలుకీ పట్టదు - పార్వతి అన్నట్లు ఆ పెళ్ళాంకయినా పట్టాలిగదా! ఆ మాటకి వస్తే ఉత్తరాది వాళ్ళకి మరీ పిచ్చిలు ఎక్కువగదా - కులం పేరుతో నరుక్కుంటారు. మతం పేరుతో పొడుచుకుంటారు. చావు విషయంలో ఆమాత్ర బాధ్యత ఉండొద్దా?

తువ్వాలుతో మొహం తుడుచుకుని వచ్చాను -

" - మనకూ వాళ్ళకూ సంబంధం లేదు పార్వతీ - ఒక్కొక్క వాటా ఒక్కొక్క యిల్లు. అంతా ఒకటే బ్లాక్ అయినంత మాత్రాన - ఒకే యిల్లుకాదు. పక్కింట్లో ఏదయినా అయితే - ఆదోషం మనకి ఉండదు గదా - ఇదీ అంతే -" అన్నాను.

పార్వతి వదలలేదు. అంతా ఒకటే యిల్లుట. వాదన మొదలు పెట్టింది. మరో విషయమయితే - అంత ఓపిక వహించే

వాడిని కాదు. నోరుమూయించేవాడిని. వినకపోతే - నాలుగు తన్నే వాడిని. చివరకి పార్వతి కసిరేదాకా వదలలేదు-

"నోరు మూస్తావా లేదా- వెధవ అమానాలూనువ్వూను -"

పార్వతి నోరు మూసేసింది. నేను చెప్పులు వేసుకుని, చొక్కా తగిలించు కుంటుంటే - అంది.

"బయటకి వెళ్తున్నారు. ఎప్పుడొస్తారో అంది.

"ఏం - ? "

"నేను ఉండలేకపోయాను. శవం లేచేదాకా - ఏమీ ముట్టకూడదుగదా - కాఫీ తాగేసాను. మీరు యిమ్మంటే యిస్తాను -"
పార్వతి మాట నన్ను ఆలోచనలో పడేసింది. దోషం ఉందని భయపడిపోతున్న తనే దున్నపోతులా కాఫీ తాగేసింది.

లేదని - కసిరానుగదా! - తాగకపోతే ఏమనుకుంటుంది పార్వతి! అది ఏదో అను కుంటుందని తాగితే - తీరా ఏమయినా అవుతుందేమో! ఏమో! - తాగకపోతే మాత్రం తలనొప్పి తప్పదు.

"కాఫీ యియ్యి - " అన్నాను.

"అయితే బయటకు వెళ్ళకండి - మళ్ళీ రావటానికి కుదరదు - కుదిరినా ఆమైల గుడ్డలతో తాగటం మంచిది కాదు - " అంది.

సర్లే - అని, కిటికీ తెరతీసి బయటకు చూసాను.

చాలా మంది పోగయి వున్నారు. గుంపులు గుంపులుగా చేరి కబుర్లలో వున్నారు. కొందరు పై క్వార్టర్సులోకి వెళ్తున్నట్లున్నారు. కొందరు కిందికి వస్తున్నారు. కింద వాటాలో ఉన్న నేను యింతవరకూ వెళ్ళకపోతే ఏం బాగుంటుంది! ఏం చేసేది - మెలకువ రాలేదు. పార్వతి లేపలేదు. ఆ విషయం ఎవరికి తెలుస్తుంది! నలుగురూ ఏమనుకుంటారు! ఏమంటారో! ఆఁ - ఎవడి జీవితం వాడిది - ఎవరయినా లోపల్లోపల అనుకున్నా - పైకి మొహం మీద ఏం అనగలరు! అదే మా పల్లెటూళ్ళో అయితే మొహం మీద ఉమ్మేతారు - మనసు అదోలా అయింది.

పార్వతి దగ్గరకి వెళ్ళాను. ఫిల్టర్‌లో డికాక్షన్ ఉంది. కాఫీ తొందరగానే అయిపోయింది. - "నువ్వు నన్ను లేపలేదు-" అంటూ పార్వతిని సణుగుతూ కాఫీ తాగాను. నేను నెమ్మదిగా మాట్లాడితే - అది ఊరు కుంటుందా-! 'మీ మగవాళ్ళు ఎప్పటికేం మాట్లాడతారో తెలిసిచావదు - ' అంది.


కోపాన్ని అణుచుకుని, కాఫీ గొంతులో పోసేసుకుని బయటపడ్డాను. నన్నెవరూ పట్టించుకోలేదుగాని - మా క్వార్టర్సులో జనం అంతా అక్కడే ఉండి - నన్నే గమనిస్తున్నట్లు అనిపిస్తోంది. పైకి వెళ్ళాను. హాలులో ఒక పక్క ఆడవాళ్ళు మరోపక్క మగవాళ్ళూ ఉన్నారు. శవం గదిలో ఉంది.

లోపలికి వెళ్ళాను. ఒకరూ ఒకరూ వెళ్తున్నారు.

శవం గది మధ్యలో నేలమీద ఉంది. పైన తెల్లటి గుడ్డ కప్పి ఉంది. మొహం కనిపిస్తోంది. ముక్కులో దూది పెట్టారు. కాలి బొటనవేళ్ళు రెండూ కట్టి ఉన్నాయి. పైన కొన్ని పువ్వుల మాలలున్నాయి. తలముందు అగరవత్తులు వెలిగించి ఉన్నాయి. పక్కగా పాండే నిలబడి ఉన్నాడు. తెల్లటి పైజమా, కుర్తాలో ఉన్నాడు. వెళ్తున్న వాళ్ళు అతని భుజం మీద తడుతూనో, చేతులు పట్టుకుంటూనో ఏవో సానుభూతి మాటలు చెపుతున్నారు. శవానికి దణ్ణం పెడుతున్నారు.

పాండే బాధపడుతున్నట్లనిపించటం లేదు, కనీసం నటన కూడా చేస్తున్నట్టు అనిపించలేదు. పలకరిస్తున్న వాళ్ళు మాత్రం బాగా నటిస్తున్నారు. నన్ను చూసి మాత్రం పాండే కాస్త బాధపడ్డాడనిపించింది. ఈ క్వార్టర్సులో మా కార్యాలయానికి చెందిన వాళ్ళం ఆరుగురు ఉన్నాం. మాలో మాకు ఎన్ని ఉన్నా - మేం కలిసి కట్టుగా ఉండక తప్పదు గదా! పైగా ఇద్దరం ఒకటే బ్లాక్ వాళ్ళం-! ఈ పాండేగాడికి ఆఫీసులో ఉండగా యీ అనుబంధాలేం ఉండవు - తండ్రి పోయేసరికి మాత్రం నేను దగ్గరవాడి నయిపోయాను.

కౌగలించుకుని, వీపుమీదరాసి సానుభూతి మాటలు చెపుతూ శవం మొహం వేపు చూసాను. మనసంతా అదోలా అయిపోయింది. నా చేతుల్లో ఉన్నది ఒక మహానటుడు అనిపించింది.




అవును - బ్రతికి వున్నన్ని రోజులూ ఆ ముసలాడు పడినపాట్లు నాకు తెలుసు. పేపరు పట్టుకుని ఎండకాగుతూ ఓ నులక మంచం వేసుకుని కిందన కూర్చునేవాడు. 'రాంరాం రావ్ సాబ్-' అనేవాడు. నేనూ 'రాంరాం' చెప్పి, పేపరు చూడటానికి, పక్కన కూర్చునేవాడిని. ముసిలాడు పేపర్లో చావుల గూర్చి ఏకరువు పెట్టేవాడు. ఉగ్రవాదులు చంపారంటే ఆశ్చర్యం. పోలీసులు చంపా రంటే ఆశ్చర్యం. వారు చచ్చారంటే ఆశ్చర్యం వరదలొచ్చి - భూకంపాలు వచ్చి అగ్నిప్రమాదాలు జరిగి - అగ్నిపర్వతాలు పగిలి - కల్తీసారా తాగి - కల్తీ ఆహారం తిని - పడవలు మునిగి - బస్సులు తిరగబడి - చావులు! చావులు! చావు అంటే ఆశ్చర్యం. పెళ్ళాల్నీ, కోడళ్ళనీ చంపటం కన్నా - తల్లుల్నీ తండ్రుల్నీ చంపటం ఆశ్చర్యం. పై వాళ్ళకన్న - కావల్సిన వాళ్ళను చంపటం ఆశ్చర్యం!

ఆ ముసలాడు అలా ఆశ్చర్య పోవటానికే ప్రతిరోజూ అంతమంది చస్తుంటారు కాబోలు - పేపరు వాళ్ళు ఆ వార్తలని ప్రచురించుతారు కాబోలు - అనుకునే వాడిని.

ఆ ముసిలాడు బీహారు యాస హిందీలో చావుల గురించి అలా ఆశ్చర్య పోతూ వుంటే నేను ఎలాంటి వాదనా చేసే వాడిని కాదు. 'నిజమే మరి' - 'దారుణమే

మరి' అంటూ నా పని చేసుకుపోయేవాడిని. నాపని షేర్ కాలమ్ చూడటం.

ముసిలాయనకి అస్మా ఉంది. అది తెల్లారుజామున మరీ ఎక్కువగా ఉండేది - కాబోలు. రాత్రంతా నిద్రపోయేవాడు కాదు. మంచం అటూయిటూ బర్రు బర్రు మంటూ జరిపేవాడు. దగ్గేవాడు. మంచం ఎందుకులాగేవాడో మొదట్లో అర్థమయేది కాదు. ఫాను కింద వేసుకోకపోతే దోమల బాధ. వేసుకుంటే చలీ - అస్మా, ఆయాసం. ముసిలాయనకి ఆ పాండే గాడు ఓ దోమ తెరకొని కట్టవచ్చుగదా - ఎందుకు కడతాడు? ఒకవేళ పాండే కడతానన్నా - పెళ్ళాం ఒప్పుకుంటుందా -? ఆమాటకి వస్తే - అసలు ఏ పెళ్ళామయినా ఒప్పుకుంటుందా - ఒప్పుకోదు.


ఆమాట అనటానికి నాకేం భయం లేదు. పార్వతితో ఓమారు అన్నాను. ఉన్నమాట ఒప్పుకోవాలిగదా - తను అంది - మగాడు నిజంగా తలుచుకోవాలిగానీ - ఆడది ఏమీ చేయలేదుట. ఈ ఆడాళ్ళకి అదేం రోగమో గానీ - ఎవరిమీదో పెట్టి మగాళ్ళందరిమీదా ఏమాటబడితే ఆమాట అనేస్తారు.

పైగా - ఓమారు 'మనమే దోమతెర కొనిద్దామండీ - ' అంది. పైగా ముసిలాడూ - పుణ్యం వస్తుందీ అంటుంది. బుద్ధిలేదా ... అంటూ తిట్టాను.

తెల్లారేసరికి ... కాఫీ తాగితే రిలీఫ్ ఉండేదనుకుంటాను. ఆకాఫీ గురించి ప్రతిరోజూ గొడవే - అందర్నీ లేపేస్తావెందుక నేవారు గాబోలు -'

"ఒకరోజుతోపోయేదా -? రాత్రివేళ కాసిన్ని పాలు ఉంచుకో వచ్చుగదా - పోనీ, రాత్రేకలిపి - ఫ్లాస్కులో పోయొచ్చు గదా -" అంది ఒకసారి పార్వతి. ఆక్షణంలో నేనేదో దృష్టితో ఉన్నాను. 'నీకెందుకే వాళ్ళ గొడవ - ? అంటూ కసిరాను కూడా. 'పోనీ - నువ్వు చెప్పువాళ్ళకి -' అన్నాను పొరపాటున.

ఇంకేముంది - వెళ్ళి ఉచితసలహాయే గదా- ఇచ్చేసింది. ముసలిపాండే భార్య ఆ సలహాయేదో తన కోడలికి యిమ్మంది. ఈ ప్రబుద్ధురాలు. ఆ పనీ చేసింది. ఆరోజు పాండే పెళ్ళామూ, పార్వతీ జుత్తూ జుత్తూ పట్టుకున్నారు. ఆడాళ్ళుగదా - మామూలుగా దెబ్బలాడుకుంటారా -' నా యింటి గొడవలు నీకెందుకు - అంటూ ఆ




ఆడమనిషి పట్టింది. నోరు మూసేసుకుని యిది లోపలికి వచ్చెయ్యాలిగదా - రాలేదు. చివరికి విషయం నాదాకా వచ్చి, రెండు తగలనిచ్చేదాకా వదలలేదు పార్వతి.

లోపలికివచ్చి - ఏడుస్తూ -" మనకెందు కంటారేంటి? మీరు నిద్రలోంచి, లేచి పోతారు - అక్కడనించి నామీద విసుర్లూ - కసుర్లూనూ -" అంది.

అయితేమాత్రం - మా క్వార్టర్సులో - మా ఆఫీసు వాళ్ళలో ఒకరికొకరికి పడదని - తతిమ్మా వాళ్ళు అనుకొంటూంటారు. వాళ్ళ విషయం వదిలేసినా - ఆ పాండేగాడు తిన్ననైన వాడు కాదు.

మా ఆఫీసులో ఎడ్మిన్‌సెక్షన్‌కి సూపరింటెండెంట్ వాళ్ళకి మా టెక్నికల్ వాళ్ళంటే పడదు. పడదేంటి - ఏడుపు. మా మెడికల్ బిల్సూ, టీఏ డీఏ క్లెయిమ్సూ, ప్రతిదీ వాళ్ళ చేతుల మీదే వెళ్ళాలి. వాడు జేబులోంచి యిన్నట్టన్నట్టే ఫోజు. ఆమాటకొస్తే - మా వాళ్ళంతా యిక్కడ చేరి ఏదయినా సాయం చేస్తే దానికి కారణం - పాండే పోస్టేనని ఎవరన్నా అంటే - ఆశ్చర్యపోను.

ఆడాళ్ళకి యీగొడవలన్నీ ఏం తెలుసు? నేనేదో యింట్లో విసుక్కుంటే వెళ్ళి వాళ్ళ నోట్లో నోరు పెట్టాలా?

ఆరోజు సాయంత్రం ముసలిపాండే కూరలషాపు దగ్గర పట్టుకున్నాడు -' నీ పెళ్ళాం బంగారు తల్లి. అడగాల్సినట్టు అడిగింది. ఇంకా లోకంలో వానలు కురుస్తాయంటే - అలాంటి పుణ్యాత్ములే కారణం -! నేను పెద్దవాడిని. ఒక్కమాట అంటాను. వయసులో ఉండగా ఎన్నడూ పెళ్ళాం చెప్పిన మాట వినలేదు. ఆరోజులు అలాంటివి. అందరికీ ఒకటే పిచ్చి - స్వతంత్రం. చదువుకు సున్నా చుట్టేసాను. జైళ్ళ పాలయాను. నలుగురు పిల్లలతో -చప్రాసీ పనికి తప్ప దేనికి పనికిరాని వాతో - ఇలావతి ఎలా బ్రతికిందో - కనీసం దాని ప్రేమ కూడా నాకు మిగలలేదు. ఈరోజు నేను అడిగితే మాత్రం ఎలా వస్తుంది-? నేనేదో మంచిపని చేసానన్న తృప్తి అయినా నాకు యీరోజున ఉంది. రేపు నీకు అలాంటి తృప్తి కూడా ఉండదు. నీభార్యని కాస్త ప్రేమగా చూసుకో -" అంటూ ఊదరగొట్టాడు. 'ఎవడి పెళ్ళాన్ని ఎవడుకొట్టకుండాఉంటాడు ముసలి కబుర్లు గానీ - ఎప్పుడో కన్నూ, కాలూ ఒంగాక లొంగవలసివస్తుందని యిప్పుడు ఎలా ఒంగి ఒంగి బ్రతుకుతాం -? అనేసు కున్నాను.

చివరకి అన్నిపాట్లు పడిన ముసలి పాండే పోయాడు. ఎన్ని చావులకో ఆశ్చర్యపోయిన ముసలి పాండే తన చావు గురించి ఆశ్చర్యపోతున్నాడో లేదో!

అక్కడనుంచి కదిలి ఓ పక్కగా నిలబడ్డాను. ముసలావిడ - ఇలావతి - ఒకమూల గోడకి జారబడి కూర్చుని ఉంది. ఆవిడ చుట్టూ కొందరు ఆడవాళ్ళు కూర్చున్నారు. పార్వతి కూడా వచ్చి చేరింది. పార్వతి కళ్ళలో నీళ్ళు చూస్తే ఆడాళ్ళు - అంత తొందరగా ఎలా ఏడవగలరా - అనిపించింది.

" - వచ్చావా రావ్ - నీకోసమే చూస్తున్నాను - అన్నాడు పిళ్ళే వచ్చి. నేను తలతిప్పి పిళ్ళే వేపు చూసాను. వాడికీ - నాకూ మాటలు లేవు. ఎలా ఉంటాయి? వాడికన్న సీనియర్నినేను. అయినా అన్నింట్లోనూ వాడే ముందుంటాడు. ఎవడయినా ఎందుకుంటాడు -పేరు కోసం. డబ్బులున్నాయి - క్లాస్‌ఫోర్ వాళ్ళకి అప్పులిస్తాడు. అంతా వెనకన తిరుగుతారు. నోరు ఉంది. వెళ్ళి - ఎంత ఆఫీసర్‌తో నయినా పోట్లాడతాడు. అందుకోసం ఆఫీసులో రూల్సు అన్నీ కంఠతా పడతాడు.

రూల్సు తెలునుగనక ప్రతివాడూ వెనకపడతాడు. నాకు అలాంటి పనికి మాలిన పనులు అంటే అసహ్యం. నాపనేదో నేను చూసుకుంటాను. అయితే మాత్రం నా సీనియారిటీ - నా అనుభవం - గుర్తించ వద్దా? అలాంటి పిళ్ళే స్వయంగా వచ్చి నన్ను పలకరిస్తున్నాడు - ఏమిటా - అన్నట్లు చూసాను. "రావుగారూ - కాస్త ఉండండి - పనుంది - బయటహాల్లో నిరీక్షించండి -" అన్నాడు నెమ్మదిగా అనేసి, వెళ్ళి పోయాడు.

ఏమిటో అర్థంకాలేదు.

నేను ఆగదిలోంచి హాల్లోకి వచ్చేసాక మా శివం దాని అర్థం ఏమిటో చెవిలో చెప్పాడు -" మిమ్మల్ని బయటికి పొమ్మ న్నాడు పిళ్ళే - "

"ఛా - అలా ఎందుకంటాడూ?" అన్నాను నెమ్మదిగా

"మీరక్కడ నిలబడిపోయారుగదా అందుకు - " అంటూ పిళ్ళే లీలలు చెప్ప సాగాడు. తెల్లారుజామున ముసిలావిడ లేచి భర్తని చూసిందిట. నిద్రలో ప్రాణం పోయిందిట. కొడుకుని లేపిందిట. వెంటనే వెళ్ళి పక్కబ్లాక్‌లో ఉన్న పిళ్ళేని లేపాడుట. వచ్చి మొదలెట్టాడట - శవం బిగుసుకు పోతుంటే కనీసం కాళ్ళు కూడా కలిపి కట్టాలని తెలీదా - అంటూ పాండేని వాయించాడుట. అగరొత్తులూ, కర్పూరం, తెల్లబట్టా తెప్పించాడుట. టెలిగ్రాం, ఫోన్‌కాల్స్‌కీ మనుషుల్ని, తరిమాడట. జనం వచ్చి పోతుంటే అక్కడేనిలబడి పోకుండా చూస్తున్నాడుట.

శివానికి పిళ్ళే మీద మంట ఉందో లేదో - గాని - నాతో మాత్రం అవసరం ఉంది నా కింద అసిస్టెంటు గదా!

" - యీరోజు శనివారం. వెరీబాడ్‌లక్ -" అన్నాడు.

" - ఏం -?" అన్నాను తెల్లబోయి

" - మీరు శుద్ధ అమాయకులు గురూగారూ - కనీసం హాఫ్‌డే అయినా మన బాస్ సెలవు యిచ్చేవాడు -" అన్నాడు.

నిజమే మరీ చిన్న ఆఫీసుమాది. ఉన్న యిరవై ముగ్గురిలోనూ ఎవరికి ఏంజరిగినా మా ఆఫీసర్ సెలవు యిచ్చే మనిషే - కాని - శివం ఎవరిదో చావుని కూడా కాష్, చేసుకునే మనస్తత్వం - నాకు నచ్చలేదు. ఆమాట చెప్పలేకపోయాను. సిట్‌అవుట్ లో నించున్నాం.




ఇంతలో సువిశేష మూర్తి వచ్చాడు. అతని మొహం గాభరాగా ఉంది. "- మీ కోసమే చూస్తున్నాను రావుగారూ - మీకు తప్పక తెలుస్తుంది. పాండేగారి నాన్నగారు నా భార్యకి కనిపించారంటండి - ఎందుకండి -?" అన్నాడు. నాకు అతనేం మాట్లాడుతున్నదీ అర్థంకాలేదు. అతనిదీ, నాదీ తూర్పు గోదావరిజిల్లా కనక, మా యిద్దరికీ చుట్టరికం ఉన్నట్లు మాట్లాడు తుంటాడు. నిన్నగాక మొన్నవచ్చి నాదగ్గర పనిచేసాడు. రేపో ఎల్లుండో నామీద ఆఫీసరై పోయినా ఆశ్చర్యంలేదు.

పావుగంటసేపు ప్రశ్నమీద ప్రశ్నవేసాక - విషయం అర్థమయింది.

చనిపోయిన పాండే పొద్దుటే వచ్చి - వాళ్ళ ఆవిడకి కనిపించాడట. భయంతో ఒళ్ళంతా జలదరించింది. భ్రమ పడిందేమో ఆవిడ - అంటే వినలేదు. తెల్లచొక్కా, షరాయీ - పండుజుత్తూ - స్వెట్టరూ - సైకిలూ అంటూ వర్ణించసాగాడు.

"చెప్పండి రావుగారూ - ఎందుకలా కనిపించాడు - ఆవిడకే ఎందుకు కన్పించాడు" - అంటూ ప్రశ్నిస్తున్నాడు.

నాకు కూడా ఎందుకు కనిపించాడో అర్థంకాలేదు. ఎలా ఒప్పుకోగలను?

"మూడు నాలుగు రోజులపాటు - మనక్వార్టర్స్ చుట్టూ ఆత్మ తిరుగుతుంది' ' అన్నాను.

"కరెక్ట్‌గా చెప్పారు సార్ - మనం అంతా ఒకే ఆఫీసువాళ్ళంకదా - అందుకని తెలిసున్నవాళ్ళకి కనపడుతుంది -" నామాటకి మాట జోడించాడు శివం.

"దెయ్యం అంటావేం - అది చనిపోయిన వాళ్ళ ఆత్మ. కొందరికి దెయ్యాలతో మాట్లాడే శక్తి ఉంటుంది. వాళ్ళని ఆటో మీడియం అంటారు. నీభార్య ఒక ఆటో మీడియం -" అంటున్నాను.

"ఏంటి - ఏంటి -" అంటూ వచ్చాడు పిళ్ళే.

సువిశేషరావు తన యింగ్లీషు పాటవ మంతా ప్రయోగించి నేనూ, శివం చెప్పిన దాన్ని పిళ్ళేకి వివరించాడు. పిళ్ళే రియాక్షన్ నేను ఊహించినట్లే ఉంది. పెద్దగానవ్వి - తల అటూ యిటూ ఊపి - అన్నాడు పిళ్ళే.

"దెయ్యాలసంగతి తర్వాత చూసు కుందాం - రావ్ - మనం చాలా పనులు చెయ్యాలి - పద - స్కూటర్ తియ్యి -" అన్నాడు.

నాకు ఆవేళాకోళం నవ్వు నచ్చలేదు. మండింది. కాని - సమాజంలో బ్రతుకు తున్నాను. ఇలాంటి కష్ట సమయంలో ఎలా తిరస్కరించగలను -! వెళ్ళి - స్కూటర్ బయటపెట్టాను.

ఇద్దరం స్కూటర్ మీద బయలు దేరాం-

చావు నమోదు చేయించాలిట. పురోహితుడిని చూడాలట. శ్మశానం సంగతి తేల్చుకోవాలిట. ఇక్కడనించి శవాన్ని కదిలించే ఏర్పాట్లు చూడాలిట.

పిళ్ళే చెపుతున్నాడు -" ఏం మనిషో - పాండే! నిజమే - తండ్రిపోతే మతిపోయిన ట్టుంటుంది. అయినా - తప్పదుగదా! ఎవరయినా బంధువులు వస్తారా - వాళ్ళకోసం శవాన్ని ఉంచాలా - అక్కర లేదా - అని అడిగితే ఏమీ తేల్చడు - చివరకి యిప్పుడు తేల్చాడు. పాట్నా దగ్గర పల్లెటూరి నించి రావాలిట. రాలేదు - అని-"

నేను ముభావంగా ఉన్నానన్న సంగతి పిళ్ళే గమనించలేదు. పట్టించుకోలేదేమో!

మాక్వార్టర్సు కొత్తగా వచ్చాయి. చుట్టూ ఫ్యాక్టరీల మధ్య ఉన్నాయి. మా ప్రాంతం

సమీపంలోని పల్లెటూరి పంచాయితీ కిందకి వస్తుందనుకుని - అక్కడకి వెళ్ళాం!

పంచాయితీ ఆఫీసు సులువుగానే దొరికింది. గుమస్తా అంతసులువుగా దొరకలేదు. 'ఎప్పుడు తెరుస్తారు -' అంటూ ఆరా తీస్తే' ఎప్పుడైనా తెరవచ్చు. ఎప్పుడూ తెరవకపోవచ్చు -' అంటూ చాలా వేదాంతికంగా జవాబిచ్చారు. చివరకు పరిస్థితి చెపితే ఒకతను మమ్మల్ని గుమస్తా యింటికి తీసుకెళ్ళాడు.

అతను చిరాకు చిరాకుగా చూసి, 'పదండి - వస్తాను' అంటూ వెళ్ళి తలుపు వేసుకున్నాడు. పిళ్ళే నేనూ మొహమొహాలు చూసుకున్నాం. భుజం మీద చరిచి - 'పద-' అన్నాను.

కాఫీ గట్రా తాగినా సమయానికీ వచ్చాడు గుమస్తా. రిజిస్టర్ తీసి ఆవులిస్తూ -" ఏయింట్లో ఉన్నారు మీరు?' అన్నాడు

"క్వార్టర్స్ - లో ఉన్నాం" అన్నాం

"మీరు కాదు చనిపోయిన మనిషి-"

"ఆయనా క్వార్టర్సులోనే ఉన్నాడు-"

ఆ క్వార్టర్సు పంచాయితీ కిందకిరావు-'

"దేని కిందకి వస్తాయి?"

"నాకు తెలియదు -"

"నీకేం తెలుసు -?" అసహనంగా అడిగాడు పిళ్ళే.

గుమస్తా పళ్ళు కుట్టుకుంటూ -" నాకు తెల్సినవి నాకు తెలుసు. నీకు తెలియని వన్నీ నాకు తెలియాల్సిన పనిలేదు-" అన్నాడు.

పిళ్ళేని వారించి, నెమ్మదిగా గుమస్తాని మంచిమాటలాడాను. మా పాండేకి ఓటు ఎక్కడుందని - అడిగాడు గుమస్తా.

మా క్వార్టర్సు వాళ్ళలో ఎవరికీ ఓటు లేదు. ఎలక్షన్ రోజున మావాళ్ళు ఓట్లు కోసం వెదికారు. మీలాంటి వాళ్ళకి ఓట్లా - అంటూ నవ్వారుట.

చెప్పాం.

చదువుకున్న మూర్ఖులు మీరు అన్నట్లు చూసాడు గుమస్తా.

ముందుగా డాక్టర్ దగ్గరకి పోయి సహజ మరణమేనని సర్టిఫికెట్ తీసుకోవాలిట. అది పట్టుకెళ్ళితే ఏ స్మశానంలోనయినా అనుమతిస్తారుట. వాళ్ళు సర్టిఫికెట్ తీసుకొని వివరాలు రాసుకుని ఒక కాగితం యిస్తారుట. దాన్ని కార్పొరేషన్ ఆఫీసులో యివ్వాలిట. కొన్నాళ్ళ తర్వాత వాళ్ళు చావు నమోదు చేసుకుని సర్టిఫికెట్ యిస్తారుట.

'- మీరు డిఫెన్స్ వాళ్ళుగదా - ఓ బాటిల్ పట్టుకెళ్ళండి. పనవుతుంది -' అన్నాడు మళ్ళీ కాఫీ తాగి - గుమస్తా. బిల్లు చెల్లించి బయటపడ్డాం.

డాక్టరు దగ్గరకు వెళ్ళాం -

ఆయన మాకు ఆథరైజెడ్ డాక్టర్. మా అభ్యర్థన విని యిబ్బందిగా కదిలాడు.

'రోగులొచ్చే సమయం - పొద్దుటే రాలేక పోయారా?' అంటూ విసుక్కున్నాడు. చివరకి మా క్వార్టర్సుకి వచ్చి చూస్తానన్నాడు. పిళ్ళే ఆటో తీసుకువచ్చాడు. ఇద్దరూ వెళ్ళారు. నేను అక్కడే కూర్చున్నాను. అరగంటలో వచ్చాడు. పిళ్ళే ఏం మాట్లాడో ఏమో - సర్టిఫికెట్ యిచ్చి తన ఫీజు వసూలుచేసుకున్నాడు.

పురోహితుడి కోసం బయల్దేరాం. 'ఉత్తరాది పండిట్ కావాలిట - పాండే మరీ మరీ చెప్పాడు -' పిళ్ళే విసుక్కున్నాడు దోవలో.


'అలాగంటే ఎలా? ఎవరి నమ్మకాలు వాళ్ళవి -' అన్నాను.

'చావులు మనవాళ్ళవయితేనే - నమ్మకాలు. లేకపోతే - చూస్తున్నావుగదా - ఎవరికీ నమ్మకాలు ఉండవు. అందరూ ఎదుటి వాళ్ళ నమ్మకాల మీద వ్యాపారమే చేస్తారు -' అన్నాడు పిళ్ళే.

నాకామాట అంతగా రుచించలేదు.

'డాక్టరకీ - ఆగుమస్తాకీ లేకపోతే లేనట్లేనా? పురోహితుడు శాస్త్రాలు చదువు కున్నాడు. అలాంటి వాళ్ళు యిలా ప్రవర్తించరు-' అన్నాను పిళ్ళే నవ్వాడు.

ఉత్తరాది పండిట్ ఆచూకీ దొరికింది. మరో యూనివర్సల్ పండిట్ అడ్రసు



దొరికింది. ఆయన దొరికాడు. ఆయన భారతదేశంలోని సమస్త రకాల వాళ్ళ - భాషలు - కులాలు - శ్రాద్ధకర్మలలోనూ ప్రవీణుడట. కొంతసేపు చచ్చిపోయిన పాండే మా నాన్న అనుకుని ఓదార్చాడు. చివరికి - అయిదు వందలు అడ్వాన్స్ యిమ్మన్నాడు. రసీదు యిచ్చాడు. రెండు గంటల్లో తనుగాని, తన శిష్యులు గాని వస్తారట. ఈలోగా మేం కొనవలసిన సామాన్ల లిస్టు ఒకటి యిచ్చాడుట. అవి తీసుకుని క్వార్టర్సుకి వెళ్ళిపొమ్మన్నాడు.

అప్పటికి పన్నెండయింది.

మార్కెట్‌లో కర్రలూ తాళ్ళూ మొదలైన సామాన్లు లిస్టు ప్రకారం కొనుక్కున్నాం. దోవలో స్మశానానికి వెళ్ళి మాట్లాడాం. అయిదు దాటినా మా కోసం చూడటానికి ముట్టజెప్పాం. వాన్‌కి ఫోన్‌చేసాం.

అక్కడ నుంచి బయలుదేరుతూంటే - పిళ్ళే కాఫీ తాగుదాం పదమన్నాడు.

'నేను తాగను - ' అన్నాను

నా మొహంలోకి చూసి చెయ్యి పట్టుకుని హోటలు వేపు నడిచాడు.

"సెంటిమెంటు రావ్‌సాబ్ -" అన్నాడు పిళ్ళే నవ్వుతూ - తనకి కాఫీ ఆర్డర్‌చేసి కాఫి తాగుతున్నాడు పిళ్ళే. ఎదురుగా కూర్చున్నాను.

"ఇలాంటి సెంటిమెంట్స్ లేకపోతే - పక్కవాడు చచ్చినా ఎవరూ పట్టించుకోరు పిళ్ళే - " అన్నాను.

"నాకు లేవుగదా - నేను పట్టించుకో లేదా?" అన్నాడు.

'నీకున్నాయి - నువ్వేం పట్టించు కున్నావు -' అన్నట్లు అనిపించింది. అతని గొంతుకలోకాని - మొహంలోకాని - ఆ ఎత్తి పొడుపు లేదు.

"ఏమో పిళ్ళే - నీలాంటి వాళ్ళకు లేకపోవచ్చు - నీలాంటి ఒంటెత్తు,

మనుషులని కలుపుకు రాటానికే యిలాంటి నమ్మకాలు నీలాంటి వాళ్ళు పుట్టించారేమో - అందామనుకున్నాను. అనలేకపోయాను. నేనూ కాఫీ తెప్పించు కున్నాను.

ఇద్దరం క్వార్టర్స్‌కి చేరాం -

మనసంతాస్తబ్దంగా ఉంది. చావు లాంటి విషయంలో కూడా ....ఎంత .... ఎంత .... ఎంత... ! అది నాలో ... కూడా .... ఉంది. పొద్దుట లేచినపుడు ... నాలో ...! ఇందులో తిరిగినపుడు .... ఇందులో భాగం అయాను. బయటే ఉంటే ... ఇంత యిదిగా ఉండేదా?

మూడు అవుతోంది

పురోహితుడు ఏవో తంతులు చేస్తు న్నాడు. వాన్ నిరీక్షిస్తోంది.

శివం నాదగ్గరచేరాడు. నామూడ్ చూసి తప్పుకున్నాడు.

నాలుగ్గంటల కి స్మశానానికి చేరు కున్నాం.

అక్కడ కూడా తను తంతులేవో చేయాలంటున్నాడు కాటికాపరి.

అన్నీ పూర్తయ్యాయి - దహనం మొదల యింది.

పిళ్ళే, మూర్తి, నేనూ యింకా కొంత మంది కూర్చున్నాం - మూర్తి మళ్ళీ తన భయాన్ని గురించి నన్ను పట్టుకున్నాడు - నేను మాట్లాడలేదు -

"ఏం రావ్ సాబ్ - దెయ్యాలున్నా యంటావా?" అన్నాడు పిళ్ళే.

మనసులో ఆరోజు కలిసిన వాళ్ళందరూ మెదులుతున్నారు.

"లేవంటావా-?" అన్నాడు శివం నా వంతు మాట్లాడుతున్నట్లు.


"ఉహుం - ! ఉండటానికి వీల్లేదు -' ' అన్నాడు.


"అకాల మరణం పొందిన వాళ్ళయినా దెయ్యమవుతారు-" అన్నాను.

"అవును పిళ్ళే సాబ్ -" అన్నాడు సువిశేష మూర్తి నవ్వాడు పిళ్ళే -" ఉంటే - యీ ప్రపంచం యిలా ఉండదు - యీ ప్రపంచం స్వర్గధామంలా ఉండేది. మనుషులంతా ఎంతో మంచిగా ఉండేవారు-"

"అంటే-?" తెల్లబోతూ అన్నాను.

"అన్యాయంగా చంపబడిన






వాళ్ళందరూ దెయ్యాలవుతారు. దెయ్యాలకు బ్రతికున్న మనుషులకన్న శక్తి ఎక్కువ ఉంటుంది. సులువుగా పగ తీర్చుకోగలవు - అదేగదా నీ అభిప్రాయం -" అన్నాడు.

"అందరి అభిప్రాయమూ అదే -" అన్నాను

"అదే నిజమయితే - తనని అణగదొక్కేసిన వాడిని, అన్యాయంగా చంపినవాడిని, దోపిడీ చేసినవాడిని, పీడించేవాడిని ... దెయ్యమయాక - చంపి పారెయ్యొచ్చుగదా! ఇన్ని వేల ఏళ్ళ మానవ చరిత్రలో - అన్యాయంగా చచ్చిన వాళ్ళంతా - చచ్చి పగ తీర్చుకుంటే - అన్యాయం చేసే వాళ్ళుండే వారుకారు. చచ్చాక ఎవడేం చేస్తాడోనని - బ్రతికున్నవాళ్ళంతా - బుద్ధిగా ఉండేవాళ్ళు -" అన్నాడు

నాకు ఒప్పుకోబుద్ధి వెయ్యలేదు.

"చాలా మంది తమకి అన్యాయం జరిగిందనుకోరు - తమకర్మ అనుకుం టారు -" అన్నాను.

"మనుషులకి ఒకప్పుడు అంత చైతన్యం లేదనుకుందాం - మనబోటి మాయగాళ్ళు దాన్ని లేకుండా చేసారను కుందాం-! యీ రోజున - తామూ మనుషులమేనని .... యీ భూమిమీద తమకూ సమాన హక్కులున్నాయని ... మానాభిమానాలు తమకూ ఉన్నాయని... తమ హక్కు కోసం పోరాడాలని తెలుసు కొన్నవాళ్ళు పోరాడుతున్నారు - పోరా టాలలో చస్తున్నారు - కనీసం వాళ్ళయినా - చచ్చాక - దయ్యాలయి రెట్టించిన బలంతో తమ పోరాటం కొనసాగించే వారుగదా -" అన్నాడు పిళ్ళే.

ఎదురుగా తగలబడుతున్న శవాన్ని చూస్తున్నాను.

పిళ్ళే మాటలను వింటున్నాను. పార్వతితో నా ప్రవర్తన మనసులో కదుల్తోంది.

నగరం సృష్టిస్తున్న ధ్వనులు దూరంగా వినిపిస్తున్నాయి. ●